
# "భవం-తద్భవం"




—చీమలమర్రి శ్రీనివాసమూర్తి

బ్రీఫ్‌కేస్ సర్దుకుని మెజోళ్ళలోకి కాళ్ళుదూరుస్తున్న కొడుకువైపు ఓ మారు సాలోచనగాచూసి, "క్యాంపుకా?" అన్నాడు అనందరామయ్య.

అవునన్నట్లు తలాడించేడు ప్రకాశరావు, ఆయన వైపు చూడకుండానే. అంతలోనే తను చేసిన తప్పు గ్రహించినవాడులా తలెత్తి, ఆయనవైపు సానునయంగా చూస్తూ "ఏమైనా కావాలానాన్నా" అన్నాడు, ఆప్యాయంగా. వయసు మళ్ళినవారు, తల ఊపటాలు, ముక్తసరి జవాబులు ఇష్టపడరని అతనికి తెలుసు. అందునా తన తండ్రి మనస్తత్వం అతనికి క్రొత్తకాదు.

"ఆ......ఏంలేదు. సాయంత్రం నీవు పెందరాళే వస్తే డాక్టరుగారి దగ్గరకు పోయొద్దామని" అన్నాడు. తన తాపత్రాయాన్ని మొఖంలో కన్పడనీయకుండా.

పెదిమలమిందికి రాబోతున్న చిరునవ్వును బలవంతంగా అణుస్తూ "సాయంత్రం ఎన్నింటికి వస్తానో తెలియదు. ఒకవేళ లేటుగా వస్తే డాక్టరుగారి దగ్గరికి రేపు పోదాం. ఎలాగూ నేను రేపు ఊర్లోనే ఉంటాను". అన్నాడు ప్రకాశరావు చిన్నపిల్లాడికి నచ్చ జెప్తున్న ధోరణిలో.

తండ్రి మనసు మారు మాట్లాడకుండా తలూపింది.

తలుపువారగా, గోడకు భుజం ఆనించి, తండ్రీ కొడుకుల సంభాషణ వింటున్నసుశీల పుర్మగర్వంగా ముసిముసి నవ్వులు నవ్వుతోంది మామగారికి కన్పడకుండా ఆమెవైపు ఓ మారు క్రీగంట చూసి, బ్రీఫ్ కేసును తీసుకుని బయటికి నడిచాడు ప్రకాశరావు. మెట్లు దిగి జీపు వేపు నడుస్తూ "వస్తాను నాన్న" అనటం మరిచిపోలేదు. కావాలనే భార్యను వలకరించటం మానుకున్నాడు.

మానవ మనస్తత్వం చాలా విచిత్రమైనది. అందునా వయసుమళ్ళిన వారిది అడుగడుగునా తమ సంతానానికి తమ మీదున్న ప్రేమను పరీక్షిస్తుంటారులా ఉంది. వాళ్ళు ఏదైనా కావాలని కోరినా ఆ కోరిక వెనుక మోజు కంటే, తమ కోరికలకు అవసరాలకు


ఎలా స్పందిస్తారో తెలుసుకోవాలనీ, ఎప్పటి కప్పుడు తమను తాము ఎస్యూర్ చేసుకోవాలనీ ఆరాటపడు తుంటారు.

నిజానికి అనంతరామయ్యగారికి డాక్టరుగారి దగ్గరకు పోవాల్సిన అవసరమే లేదు. నెలక్రితమే దగ్గరుండి, చేయాల్సిన పరీక్షలన్నీ చేయించాడు ప్రకాశరావు. ఆ డాక్టరు గారు ప్రకాశరావు స్నేహితుడవటం చేత, చాలా శ్రద్ధతో చేశాడు ఆయన చెప్పినదంతా ఓపిగ్గా విన్నాడు. ఫిజిషియన్ శాంపిల్స్ నుండి, రెండు టానిక్కులు, బికజుల్స్ కాప్సూల్స్ తీసి ఇచ్చాడు. "మీకు ఇంకా పది సంవత్స రాల వరకు ఢోకాలేదు" అని తేల్చిచెప్పాడు. అనంతరామయ్య మనసు తాత్కాలికంగా ఉపశమించినా, తెలియని ఆరాటం తాపత్రయం తొంగి తొంగి చూస్తుంది. క్రమం తప్పకుండా ఆయనిచ్చిన మందులు వాడే వాడు. ఎన్నడైనా మలవిసర్జన రెండు గంటలు ఆలస్యమయితే విలవిలలాడిపోయే వాడు. గడపదాటి నాలుగడుగులు బయటికి వేసివస్తే ఆయాసమని తెగ ఆరాటపడేవాడు. తనకు తెలీకుండా తనమనసు గతాన్ని, యవ్వనపు బలాన్ని, పోల్చి చూసుకుంటున్న దనే విషయం ఆయనకుతెలియదు.

డాక్టరుగారు తనకొడుకు స్నేహితుడు కాబట్టి అలాగే చెప్తాడనే అనుమానం ఆయన మనసంతా ఆక్రమించింది. తనకు తెలియకుండా తనకొడుకుతో ఏదైనా చెప్పి ఉంటాడనే అతను దాస్తున్నాడనీ అనుమానం. దీనికి తోడు పార్కులో కలిసిన తన ఈడు స్నేహితులు ఎవరు క్రొత్త డాక్టరు పేరు చెప్ప టంఫలానావారి హస్తవాసి మంచిదనటం లాంటి విషయాలు అతని మనసులో నాటుకు నేవి. ఫలితంగా ఒకడాక్టరు దగ్గరనుండి మరొకరి దగ్గరకు మారటం ఆయనకు పరిపాటి అయింది.

డాక్టర్లందరి ప్రవర్తనా ఒకేలా ఉండదు. ఒకరు నోరుమెదపకుండా, వినాల్సిందివిని, ప్రిస్క్రిప్షన్ వ్రాసి ఇచ్చారు.

ఇంకొకడాక్టరు గారు అన్ని పరీక్షలు పూర్తిచేసి "మీకేంలేదు బాబాయిగారూ! సలక్షణగాఉంది మీఆరోగ్యంఅని అంతటితో ఊరుకోకుండా "అయినా నాకు తెలియక అడుగుతాను సర్వం తెలిసిన మీరు, నిండాడెబ్బది నిండిన ఈ వయసులో, ఇంకా ఈ పరితాపం ఎందుకండీ," అన్నాడు పుటుక్కున. అనంత రామయ్యగారు పైకి చిరునవ్వు చిందించినా, మనస్సు చివుక్కుమంది.




"వార్ధక్యం ఒక నిరర్థకమైన కొనసాగింపు. తిండిగింజలఖర్చుకు తప్ప మరిదేనికీ పని కిరాదు. అందుకనే ముసలివాళ్ళపట్ల పిన్న వాళ్ళకు చులకన భావం ఉంటుంది" అన్నడొక మిత్రుడు. ఆయన మనసులో అవి లోతుగా పాతుకుపోయాయి. డాక్టరుగారి మాటలు, అందుకనే ఊరటకల్గించాల్సింది పోయి, అనుమానాన్ని రూఢి పరచినట్లని పించింది. ఆయనగారు వ్రాసి ఇచ్చిన మం దులచీటీ కాంపౌండ్ దాటకుండానే ముక్కలు ముక్కలుగా చించేసి, మురుగు కాలవలోకి విసిరేసి చేతులు దులుపుకున్నాడు.

"డాక్టరు గారు ఏమన్నారు మావయ్యా"? అన్నకోడలి ప్రశ్నకు అతనికి పెద్దగా అనుభవమున్నట్లు లేదమ్మా!" అంటూ పెదవి విరిచారు. ఆయన చెప్పకపోయినా సుశీలకు అర్థమైపోయేది. బయటకు కన్పడకుండా పోనీలేండి ఆయనొచ్చిన తర్వాత మరో మంచి డాక్టరుకు చూపిద్దాం' అనేది అనునయిస్తున్న ధోరణిలో అనంతరామయ్య మనసు సంతృప్తిగా శ్వాసపీల్చుకునేది. తనను పూర్తిగా అర్థం చేసుకోగలిగిన కోడలివంక కృతజ్ఞతపూర్వకంగా చూసేవాడు.

☆☆☆

వయసు మీద పడుతున్న కొద్దీ, ఏదో ఒక లోపం వచ్చితీరుతుందని ఆయన ధృఢ విశ్వాసం. యవ్వనంలో, ఏంచేసినా, ఏంతిన్నా, ఏంతాగినా, ఏమీకాదు. కానివాటి ఫలితం మాత్రం వృద్ధాప్యంలో అనుభవించక తప్పదు' అని ఎక్కడో ఎప్పుడో చదివారు. వివరాలు జ్ఞాపకం లేవుగానీ, మాటలుమాత్రం నాటుకు పోయి ఊడలు దిగాయి.

ఆయన జీవితం ఒక పద్ధతిలో సాఫీగా నడిచింది కాదు. అల్లరి చిల్లరిగా తిరిగేవాడు. వ్యసనాలంటూ ప్రత్యేకించి ఏమీ లేకపోయినా, ఆయన వ్యవహారం తండ్రికి నచ్చేది కాదు. ఎన్నోసార్లు మందలించారు విసిగివేసారి అప్పుడప్పుడూ చేయి చేసుకునే వాడు. ఎంత సేపూ తనస్వేచ్ఛా జీవితానికి అడ్డుపడుతున్నాడనే కోపమే తప్ప మందలింపు వెనుక నున్న పితృహృదయం అతనికి అర్థమయ్యేది కాదు. అందుకే తండ్రి అంటే ఒకరకమైన చులకన, ఏహ్యత అతనికి తెలియకుండానే అతని మనసులో చేసుకున్నాయి. దానిఫలితమో ఏమోగాని, అనంతరామయ్య గారి తండ్రి వీరయ్య గారి చివరి రోజులు బాధగా బరువుగా గడిచాయి. ఒకేఒకకొడుకు ఎదిగి ఒక ఇంటివాడైనా, వొచ్చి నావిడచేతిలో కీలు బొమ్మ అయినాడు. ఆమె అయినదానికి, కానిదానికి కూడా విసుక్కునేది. అనంతరామయ్యగారు ఆమెకు వంతపాడేవారు బాల్య దశలోని స్మృతులు ఏరూపంలో ఎక్కడ నిక్షిప్తమైనాయో ఆయనకు తెలీదుకానీ, తండ్రి వృద్ధాప్యదశలో తమతమ స్థానాలు మారిపోయాయి. ఒకరకంగా తనకు తెలీకుండానే ఆయన మీద కక్ష తీర్చుకుంటున్నాననే విషయం ఆయనకు ఏనాడూ స్ఫురణకు రాలేదు.

తీరా తను వృద్ధాప్యంలోకి అడుగిడినప్పుడు ఆనాటి నీడలు వెంటాడుతున్నాయనే విషయం అస్పష్టంగా మాత్రమే తెలుసు.

నాలుగైదు సంవత్సరాల వరకు అనంతరామయ్యగారు పిల్లలకు ట్యూషన్ చెప్పేవారు. బడిపంతులుగా రిటైర్ అయిన తర్వాత ఊరికె కూర్చుండ బుద్ధికాక, నలుగురు పిల్లలను కూడేశారు. ఏదో ఒకవ్యాపకం ఆయనకు ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రకాశరావు కూడా అందుకు అభ్యంతరం చెప్పలేదు. నిజానికి ఆయన సంపాదించవలసిన అగత్యం ఆకుటుంబానికి లేదు. రిటైరయిన మొదటి సంవత్సరంలోనే భార్య పోయింది.

ఒక్కగానొక్క కొడుకు ప్రయోజకుడైనాడు. అది కూడా, ఆయన ఊహలకు అందనంతగా ఎదిగాడు. ఎత్తుకోవలసిన బరువులూ దించుకోవలసిన బాధ్యతలూ ఏవీలేవు. ఆయన ఎంతసంపాయిస్తున్నదీ, ఏం ఖర్చు పెడుతున్నదీ ఎవరూ అడగరు. అప్పుడప్పుడూ, అడక్కుండానే, పిల్లవాళ్ళబట్టలకో, కోడలకీ కొడుక్కూ పండగకు బట్టలకో ఖర్చుపెట్టేవాడు.

పేదరికంలో నుండి వచ్చినా కొడుకు గెజిటెడ్ ఆఫీసర్ కావటం - అటుభర్తకూ, ఇటూ తనకూ అనుకూలవతియైన కోడలు లక్ష్మీదేవిలా ఇంట కాలు మోపటం - ముత్యాల్లాంటి ఇద్దరు మనుమలు - ఇన్ని ఉన్నా ఆయన మనసులో ఎక్కడో ఏమూలో అశాంతి, తిష్టవేసుకు కూర్చుంది. వయసు మళ్ళిన నాటినుండి అధ్యయనం చేస్తున్న "భగవద్గీత" కూడా ఆయనకు ఎలాంటి స్వాంతన అందించలేకపోయింది. అలవాటుగానే తప్ప అవగాహన కోసం, అన్వయింపుకోసం చదివిన పాపాన ఏనాడూ పోలేదాయన.

★★★

సాయంత్రం ఐదుగంటలకు యధాప్రకారం మనమళ్ళిద్దరినీ స్కూలునుండి తీసుకువచ్చారు. అది ఆయననిత్యకృత్యం.

రాగానే "ప్రకాష్ ఇంకారాలేదా అమ్మా!" అన్నాడు.

"రాలేదు మామయ్యా! లేటవుతుందని చెప్పాడుగదా?" అన్నది. ఆయన ఇంకేమీ మాట్లాడలేదు. హోమియో పతి డాక్టరు ను కలవాలని మనసు తహతహలాడుతున్నది. పార్కులో కలిసిన అంజయ్య పంతులు ప్రత్యేకంగా చెప్పాడు ఆయనగురించి చాలా నిక్కచ్చిమనిషని, ఉన్నదున్నట్లు సూటిగా చెప్తాడనీ హస్తవాసి మంచిదనీ ఇంకా ఏమేమో చెప్పాడు. చూడకుండానే ఆయన మీద గురి కుదిరింది అనంతరామయ్యకు. కానీ స్వయంగా తీసుకుపోతానన్న కొడుకు మాటకాదని, తనొక్కడే పోతే ప్రకాష్ ఎక్కడ బాధపడ్తాడో నని ఒక ప్రక్క పీకుతోంది.

సుశీలకు ఆయన వాలకంలోని అశాంతి అర్థమయింది కాఫీ గ్లాసు చేతికిస్తూ, ఆయన ప్రక్కనే కూర్చుంది. ఆర్చుకుంటూ, ఆర్చుకుంటూ ఆయన కాఫీ త్రాగుతుంటే సాలోచనగా చూస్తూ కూర్చుంది.

ఇంతలో చిన్నవాడు చైతన్య పరుగెత్తుకుంటూ వచ్చాడు చేతిలో గాలి పటాన్ని ఊపుకుంటూ.

తాతాయ్యా! గాలిపటానికి దారం కట్టవా?' అంటూ మూతిగుండ్రంగా పెట్టి గోముగా అడిగాడు కాఫీ ముగించి ఆప్యాయంగా వాణ్ణి వొళ్లో కూర్చుండ బెట్టుకుని కబుర్లుచెప్తూ గాలిపటానికి దారం కట్టిఇచ్చాడు. వాడు బయటికి తుర్రుమన్నాడు.

అంతవరకు తాతమనుమల అనురాగాన్ని పరిశీలనగా చూస్తూ కూర్చున్న సుశీల అనునయంగా అడిగింది.

"మామయ్యా! నేనొకమాట అడుగుతాను. మీరేమీ అనుకోరుగా?"

క్షణకాలం కోడలికేసి కొద్దిపాటి విస్మయంతో చూశాడు. కాపురానికి వచ్చిన ఆరేడు సంవత్సరాల తర్వాత మొదటిసారిగా ఇంత అనునయంగా, తండ్రిని అడిగినట్లు అడుగుతోంది.


"అడుగమ్మా! కోపమెందుకు?" అన్నాడు.

"మామయ్యా! కొద్దోగొప్పో మీరూ చదువుకున్నారు. జీవితాన్ని పూర్తిగా రుచి చూశారు. గీతాపారాయణం, నారాయణ స్తోత్రం, గాయత్రి ఉపాసన క్రమం తప్పకుండా చేస్తున్నారు. ఈ మానవజన్మ నశ్వరమనీ, పుట్టిన ప్రతిజీవి గిట్టక తప్పదనీ, ఇదికేవలం ఒక మజిలీ అనీ మీరు చాలాసార్లు ఇతరులకు చెప్పగా విన్నాను. అసలుపుట్టుకే చావుకు తొలిమెట్టనీ, రెండు అనంతమైన గాఢాంధకారాల మధ్యన ఉండే అస్పష్టమైన వెలుగురేఖ లాంటిదీ జీవితమని మీకు తెలియంది కాదు. అయినా ఈ వయసులో మీరు మృత్యువంటే ఎందుకింత భయపడుతున్నారు? నేను ఇలా అడుగుతున్నానని మరోలా అర్థంచేసుకోకండి' ' అన్నది, మాటల పొందికతో మనసు నొప్పించకుండా.

రెండుచేతులు మంచం పట్టెల మీద నిటారుగా ఆనించి, నేలచూపులు చూస్తూ కూర్చున్న అనంతరామయ్య ఒకసారి సాలోచనగా తలపంకించి, కోడలికళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు.

"నా బాధ మీకిప్పుడు అర్థంకాదమ్మా! జీవితంలో ఎన్నో వొడుదుడుకులు చూశాను. తిన్నానో తినలేదో ఎలానెట్టుకొచ్చానో అంతా ఆ భగవంతుడికే తెలుసు. వాడు ప్రకాష్ ఇంతవాడవుతాడని నేను కలలో కూడా ఊహించలేదు. నారుపోసిన వాడు నీరుపోయడా అని అన్నీ ఆయన మీదేసి ఊరుకున్నాను. పై చదువులు కావాలంటే నా అసమర్థతను కప్పిపుచ్చాకోవటానికి, కల్లబొల్లి కబుర్లల్లి ఏవేవో కారణాలు చెప్పాను. అయినా నా మాటలను కాదని, తన దారిని తాను ఎన్నుకొని వాడింతవాడైనాడు. వాణ్ణి చూస్తుంటే నాకు మేరు పర్వతమెక్కినంత గర్వం......" కొద్దిసేపు ఆగి మళ్ళా కొనసాగించాడు.

"అవును, నిజమే, నీవు అన్నట్లు చావంటే నాకు భయమే. కాదనలేను. కానీ భయం లేనిదెవరికి? సర్వం పరిత్యజించామన్న మహా మహులకే సాధ్యం కాలేదు. భవబంధాలను సునాయాసంగా తోసిరాజన టానికి. ఇకనాలాటి మానవమాత్రు డికెలా సాధ్యంమౌ తుంది, మృత్యువును సాదరంగా ఆహ్వానించటానికి, పడమటి కొండల మీది సూర్యుడికి తెలుసు, పరితపించినా ప్రయోజన ంలేదనీ, ఇప్పుడో ఇంకాసేపటికో క్రుంగక తప్పదనీ, అయినా భయం తప్పదు. అనుభవం వేరు, అనుభూతి వేరమ్మా. మొదటి దానికి భాష ఉంది. వ్యక్తీకరించవచ్చు. రెండోదాన్ని ఏ భాషలోకీ తర్జుమా చేసి చెప్పలేము. జీవికి పూర్వార్థంలో మనిషి మృత్యువును కనీసం ఆలోచించనైనా ఆలోచించడు. ఏదో ఒక విపత్కరపరిస్థితిలో ఇరుక్కున్నప్పుడు తప్ప. పుట్టిన రోజు ఉత్సాహంగా జరుపుకునే



వేడుకలో ఎవరైనా ఆలోచిస్తారా, చివరి మజిలీకి చేరువగా తాను ఒక మెట్టుపైకి ఎక్కానని? ఆలోచించరు. అది మానవనైజం. అది ఒకరకంగా, చావును ఆహ్వానించడమే. వయసు, అటువంటి ఆలోచనలను రానీయదు. రావటం మంచిదీ చెడూ కూడాను. మానవజీవితగమ్యం మృత్యువనే భావన కలిగిననాడు, మానవప్రయత్నాలన్ని అర్థరహితాలే అవుతాయి. మానవ సంబంధాలన్నీ అసంబద్ధాలే అవుతాయి. అందుకనే రేపుమీద తీపితో బ్రతుకమని ఆ సృష్టే నిర్దేశించింది. ఊహించని విధంగా ఇంతై అంతై ఎదిగిన నా ప్రకాష్......తన కొడుకును ఎలా తీర్చిదిద్దుతాడో తనివితీరా చూడాలనే నా కోర్కె అసమంజసం అంటావామ్మా?"

సుశీల నిశ్చేష్టురాలై చూస్తూ ఉండిపోయింది. సాదాసీదాగా కనపించే ఆ ముసలాయన గుండెగుహల్లో ఎటువంటి భావనా వీచికలు కొట్టుమిట్టాడుతున్నయో తలుచుకుంటే ఆమెకు ఆశ్చర్యమేసింది. ఆ భావాల తాలూకు నీడలు మనసున మెదిలాయో ఏమో, చీరెచెంగుతో ఆయన కనుకులలోని నీటి బిందువలను తుడిచింది.

ఆరుగంటల ప్రాంతంలో వాకిట్లో ఏదో ఆటో ఆగితే తలుపుతీసి చూసింది సుశీల. తన బర్త ఆఫీసులో పనిచేసే సూపర్నెంటు. ఎందుకో అర్థంకాలేదు. ప్రక్కనే ఆయన కూడా ఉన్నారేమోనని చూసింది. మనసు అనుకోకుండా కీడును శంకించింది.

"సార్‌కు చిన్న యాక్సిడెంట్ అయిందమ్మా, పోలీస్ జీపు అనుకుని మందుపాతర పేల్చారు. అదృష్టవశాత్తు........

మిగతామాటలు ఆమెకు వినపడలేదు. వినేపరిస్థితిలో కూడాలేదు. కాళ్ళక్రింద నేల అదిరిపోతోంది. ఒక్కసారికి రక్తమంతా ఇంకిపోయినట్లయింది. తలుపు ఆసరాగా పట్టుకుని నిల్చుండిపోయింది క్షణకాలం. అంతే మరునిముషంలో తేరుకుని ఆటోకేసి ఉరికింది.

"ఎవరికమ్మా! యాక్సిడెంటు ఎవరికి?" అంటూ పచ్చాడు అనంతరామయ్య.

"మామయ్యా, మీరు పిల్లలెక్కడున్నారో ఒకసారి చూసి యం. జి. యం.కు తీసుకుని రండి. ఆయనకు యాక్సిడెంట్ అయిందట ........నోటికి కొంగు అడ్డంపెట్టుకుని పెల్లుబుకున్న దుఃఖాన్ని ప్రయత్నపూర్వకంగా అడ్డుకుంటూ పోనీ" అంది.

అనంతరామయ్య గుండె నీరయింది. శరీరం పెనుగాలికి నిలిచిన చిగురుటాకులా వణికింది. నిల్చోటానికి శక్తి చాలక గడపలోనే కూలబడ్డాడు. మనసు పరి పరిపరివిధాల పోతోంది. ఉన్న ఒక్కగానొక్క కొడుకు - ఇంకా జీవితంలో అరభాగమైనా అనుభవించని తన ప్రకాష్ - స్థితి తలచుకుంటే గుండె మూగగా రోదించింది.

"నాబిడ్డకు ఏమీకాదు. ఏమీ అవదు" అని తనకు తానే ధైర్యం చెప్పుకున్నాడు. కాని అదిక్షణకాలమే మనసు మళ్ళా కీడునే సూచిస్తోంది. ఆభావనే అతణ్ణి తల్లడిలజేస్తోంది.

"హే భగవాన్! నాకళ్ళముందే నేను జన్మనిచ్చిన నావాడికి అన్యాయం చేయకు. ముక్కుపచ్చలారని పసివాళ్ళను అనాధలను చేయకు. పట్టుమని పదిసంవత్సరాలైనా నిండని ఆ అమాయకజీవిని విధవరాలిగా చేయకు. ఇవన్నీ చూసే దౌర్భాగ్యం నాకు కలుగనీకు" అంటూ ఆక్రోశించిందాయన హృదయం.

హఠాత్తుగా ఆయనకు చావంటే భయం పోయింది. మునుపటి తాపత్రయం మటుమాయమైంది. నియమ నిబంధనలు లేని మృత్యుదేవత పింత ఆటలో ఎవరు ముందో, ఎవరు వెనుకో నిర్ధారించలేమనే సత్యాన్ని అప్పుడే గ్రహించిన. వాడులా నిర్వికారుడైనాడు.

పిల్లలతో కూడా ఆటోలో హాస్పిటల్‌కు పోతూంటే ప్రతిక్షణం ఒక యుగంలాగడిచింది.

గడిచిన ప్రతిక్షణం ఆయన హృదయపూర్వకంగా మృత్యువుకు ఆహ్వానం పలికాడు మౌనంగా.

## వచన కవితా సంపుటాలకు "ఆర్టోస్" సాహిత్య పురస్కారం

ఉత్తమ సాహిత్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో "ఆర్టోస్" ప్లాటినం జూబిలీ ఉత్సవాల సందర్భంగా 1995లో "సాహిత్య పురస్కారం" ప్రారంభించాము. మొదటి సంవత్సరం ప్రకటించిన కథా సంపుటాల అవార్డును శ్రీ వారాల కృష్ణమూర్తి "దేవర దున్న"కు బహూకరించిన విషయం సాహితీ మిత్రులకు తెలిసిందే !

1996 సంవత్సరానికి "ఆర్టోస్" సాహిత్య పురస్కారం వచనకవితా సంపుటాలకు కేటాయించాము. ఉత్తమ కవితా సంపుటానికి మూడు వేల రూపాయల నగదు బహుమతి నిచ్చి 'ఆర్టోస్' జ్ఞాపికతో సత్కరిస్తాము. ఈ సాహితీ పురస్కారసభ జనవరి, 26న జరుగుతుంది. కావున సాహితీ మిత్రులు 1993-95 సంవత్సరాల మధ్య ప్రచురించిన తమ వచన కవితా సంపుటాలు నాలుగు ప్రతులు అక్టోబరు 31వ తేదీలోగా పంపి సహకరించవలసిందిగా కోరుతున్నాము.

ఇట్లు
అడ్డూరి పద్మనాభరాజు
వ్యవస్థాపకులు
"ఆర్టోస్" సాహిత్య పురస్కారం

చిరునామా :
అడ్డూరి పద్మనాభరాజు
"ఆర్టోస్" సాఫ్ట్‌డ్రింక్స్
రామచంద్రపురం - 533 255.
తూర్పు గోదావరి జిల్లా



హైదరాబాదులో ఇటీవల జరిగిన వివేకానందు ప్రగతి అవార్డుల కార్యక్రమంలో సుప్రసిద్ధ ఆధ్యాత్మిక రచయిత్రి శ్రీమతి రోహిణి వెంకట సుందర వరద రాజేశ్వరికి అవార్డుని ప్రదానం చేస్తున్న లామ్‌కో గ్రూప్ అధ్యక్షులు ఎస్. కొండలరావు